క్లుప్తంగా...

సీనియర్లకే గోషామహాల్ టికెట్టు ఇవ్వాలి

అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గం బీజేపీ టికెట్‌ను సీనియర్లకే ఇవ్వాలని కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. 41 ఏళ్లుగా నియోజకవర్గంలో తాను ప్రాతినిధ్యం వహిస్తూ.. నగర బీజేపీలో పలు పదవులు బాధ్యతాయుతంగా చేశానని కిషన్‌రెడ్డిని కలిసి వివరించారు. 1982లో బీజేపీలో చేరి బీజేపీ పటిష్టతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశానన్నారు.

గోషామహాల్ అభివృద్ధికి కృషి



అబిడ్స్: గోషామహాల్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నియోజకవర్గంలో ఆగాపురా నమాజ్ గ్రౌండ్ వద్ద మరమ్మతులు, బారాదరి, జాంబాగ్, సుభాన్‌పురా ప్రాంతాల్లో పలు సమస్యలు పెండింగ్ పనులను మంత్రికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డుతో పాటు ఇతర శాఖల అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మహ్మద్ సలీం, యూసుఫ్ పటేల్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ మాజీద్, మహ్మద్ అమీర్ తదితరులున్నారు.

నేడు ఉస్మానియాలో ప్రభుత్వ వైద్యుల మహాధర్నా

అఫ్జల్‌గంజ్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన మహాధర్నాలో ప్రభుత్వ వైద్యులు పాల్గొనాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. నేడు ఉదయం 9 గంటలకు ఉస్మానియా ఆసుపత్రి ఎదుట మహాధర్నా ఉంటుందని తెలిపారు. డీఎంఈ పరిధిలో పనిచేసే వైద్యులకు పీఆర్సీ, ఏరియర్స్ బకాయిల విడుదల, ఉస్మానియా ఆసుపత్రి భవన పునర్నిర్మాణం, జీవో నెంబర్ 142 రద్దు చేస్తూ.. డిప్యూటీ డీఎంహెచ్ఓ పోస్టుల పునరుద్ధరణ, ప్రజారోగ్య విభాగంలోని వైద్యులకు టైం బౌండ్ ప్రమోషన్లు, వైద్య విధాన పరిషత్తును సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చి ట్రెజరీ ద్వారా జీతాలు, హెల్త్ కార్డుల జారీ తదితర సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మహాధర్నాలో ప్రభుత్వ వైద్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగామ మైత్రిప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని 150 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు అర్హులు. నేడు ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933.

కవి చంద్రమోహన్‌గౌడ్‌కు సత్కారం

గౌలిపురా: తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సాయుధ పోరాటం 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. గ్రహీత గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రావి నారాయణరెడ్డి మనువరాలు రావి ప్రతిభ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు.

బహుభాషా నాటకోత్సవాలు

గన్‌ఫౌండ్రీ: అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహించే అభినయ జాతీయ థియేటర్ ఫెస్టివల్ వేడుకలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. రెండో రోజైన మంగళవారం ఒడిశాకు చెందిన కోక విజయలక్ష్మి నృత్యరూపకం, సబల్‌పూర్ కళాకేంద్రానికి చెందిన వారిచే శర్మంగ్లా, అనే సినీ నాటకం, హక్కు అనే తెలుగు నాటక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అభినయ థియేటర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధితోనే పలు పార్టీల వారు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని గోషామహాల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దూల్‌పేట్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలు ప్రాంతాల బీజేపీ కార్యకర్తలు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. గోషామహాల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అఖీల్ అహ్మద్, అన్వార్ హజార్, ఫయూమ్, నాజర్‌ఖాన్, సుభాష్‌సింగ్, దినేష్ సింగ్, శంకర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



అఫ్సర్‌ఖాన్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: తమ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన గోల్కొండ, మోతీదర్వాజ, అఫ్సర్‌ఖాన్ కాలనీ, తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల వారిని కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో రోడ్డు పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నాలా పరిసరాల్లో దోమలు విజృంభిస్తున్నాయని అహ్మద్ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కాలనీల్లో రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని, కంపెనీ బాగ్‌లో జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనులు కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులను కోరుతానని ఆయన అన్నారు. వరుసగా వర్షాలు కురుస్తున్న కారణంగా పనుల్లో జాప్యం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తేవాలని, తన కార్యాలయానికి వచ్చి వివరించాలని ఆయన కోరారు. మజ్లిస్ పార్టీకి అన్ని ప్రాంతాలలో ఏరియా కమిటీలు ఉన్నాయని, తమ సమస్యలను ఆ కమిటీ సభ్యుల దృష్టికి తెస్తే కూడా వాటిని తాను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు బద్దర్‌ఉద్దీన్ తదితరులున్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ పాదయాత్ర



కాంగ్రెస్ పాదయాత్రలో పాల్గొన్న కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ అసలు సిసలైన సెక్యులర్ పార్టీ అని ఆ పార్టీ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో మంగళవారం కార్వాన్‌లో పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ఎన్నికల హామీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళా సాధికారిత కోసం పక్కా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తమ పార్టీకి అపారమైన పాలన అనుభవం ఉందని, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమైందని ఆయన అన్నారు. ఉత్తుత్తి హామీలు ఇస్తు ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని ఆయన అన్నారు. అదే విధంగా దేశ ప్రజలను విభజించి పాలిస్తున్న బీజేపీ పట్ల కూడా ప్రజలలో మంచి అభిప్రాయం లేదని ఆయన అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, అబ్దుల్ అమీద్, గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీరాములు, సుజాత తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్

దూద్‌బౌలి: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఉర్దూ మస్కాన్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై చెక్కులను అందజేశారు. 10 మందికి కల్యాణలక్ష్మి, 38 మందికి షాదీముబారక్ రూ.58,06,728ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు పేదప్రజలకు అందే సంక్షేమ పథకాలు బీసీబంధు, మైనార్టీలకు లక్ష రూపాయల చెక్కుల పంపిణీ, దళితబంధు, గృహలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు అందేలా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు ముజఫర్‌అలీ ముస్తాఫా, సోహేల్ ఖాద్రీ, సాహిల్ అక్బర్, నాయకులు బాకర్ అలీఖాన్, ముజ్జు పటేల్, విజయ్, రషీద్, ఫజల్, బహదూర్‌పురా మండల సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఆచార్య ఎస్.జయరామిరెడ్డి

నాంపల్లి: వివిధ రంగాల్లో కృషి చేసిన పలువురు ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాలు–21 అందజేసింది. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ కళామందిరంలో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల పేరిట నెలకొల్పిన ఈ స్మారక పురస్కారాలను ప్రతి ఏటా తెలుగు వర్సిటీ అందజేస్తూ వస్తోంది. మొత్తం 22 మందికు ఈ పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు, ముఖ్యఅతిథిగా చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఆచార్య ఎస్.జయరామిరెడ్డి హాజరై గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానించిన మిత్రకృష్ణ

జియాగూడ: సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతోనే యువత బీఆర్ఎస్‌లోకి చేరుతుందని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో వెంకటేష్‌నగర్‌కు చెందిన యువత బీఆర్ఎస్‌లోకి చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు యువత, ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, ఎస్సీసెల్ అధ్యక్షుడు రఘునాథ్, ప్రకాష్, భవాని విశాల్‌సింగ్, రవీందర్, సాయిరాజ్, కన్నా, ప్రమోద్ తదితరులున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



మాట్లాడుతున్న గాజుల నర్సయ్య

నాంపల్లి: వేతన సవరణ కమిటీని తక్షణమే వేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతినెలా పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు 1 న పెన్షన్ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీ.ఆర్‌లను వెంటనే చెల్లించాలి కోరారు. పెన్షనర్లకు బకాయిపడ్డ వైద్యబిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, మార్కెటింగ్, గ్రంథాలయాల్లో పనిచేసే పెన్షనర్లకు తక్షణమే హెల్త్‌కార్డులను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి నవనీతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులు యండీ.రఫియుద్దీన్, కోశాధికారి శ్రవణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు హెచ్.రాములు, కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

జియాగూడ: వర్షాల కారణంగా పాడైన రోడ్ల మరమ్మతు పనులకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. మంగళవారం ఉదయం డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా డివిజన్‌లోని 2బీహెచ్‌కే, కేశవస్వామినగర్, శివాజీ చౌక్, భరత్‌నగర్, 2జీ బస్టాండ్ తదితర ప్రధాన రహదారుల్లో బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టామన్నారు. ఆనంద్, మహేష్, నితేష్, పరమేష్ తదితరులున్నారు.



మరమ్మతు పనులను ప్రారంభించిన వెంకటేష్‌యాదవ్

కార్వాన్‌లో బీజేపీ విజయం ఖాయం



బీజేపీ నాయకులు, కార్యకర్తలో పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ బలీయంగా ఉందని, నియోజకవర్గంలో ఈసారి బీజేపీ గెలవడం ఖాయమని పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఈసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపడం ఖాయమని అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, శాస్త్రసంకేతిక రంగాల్లో సాధిస్తున్న విజయాలు ప్రధాని మోదీ సమర్థపాలనకు నిదర్శనాలన్నారు.

మిలాద్ ఉన్ నబీ కమిటీ సమావేశం

గోల్కొండ: మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆల్ ఇండియా అజ్మత్ ముస్తఫా మిలాద్ ఉన్ నబీ ఆహ్వాన కమిటీ చైర్మన్, వక్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ అన్నారు. మంగళవారం టోలిచౌకీలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రభుత్వం, పోలీసుల సూచనల మేరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని ఆయన అన్నారు. అదే విధంగా విద్యార్థులకు మదర్సాలలో చదివే వారి కోసం క్విజ్, సీరత్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి డాక్టర్ ముఫ్తీ అబ్దుల్ వాసీం, అహ్మద్ సూఫీ, డాక్టర్ మహ్మద్ ఆలీ ఖాద్రీ, ఆఫీజ్ అహ్మద్ ఇమ్రాన్ తదితరులున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



జియాగూడలో దీక్ష చేస్తున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

జియాగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం బీజేపీ నైతిక బాధ్యత వహించాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇనుముల నర్సయ్య మాదిగ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి మిర్యాల నవీన్‌కుమార్ మాదిగ, కో– ఇన్‌చార్జి చంద్రమోహన్ మాదిగ అధ్యక్షతన మహాదీక్షను చేపట్టగా.. ఈ దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. ఈనెల 18 నుండి 22 వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి బీజేపీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘమైన వర్గీకరణ పోరాటానికి బీజేపీ న్యాయమైన ముగింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మన్యం మాదిగ, శ్రీనివాస్, కిషన్, దాసు, యాదగిరి, శ్యామ్, గోపాల్, సత్యనారాయణ, పెంటయ్య, ఎం.నాగరాజు మాదిగ తదితరులున్నారు.

స్థానిక సమస్యలపై ఎంపీకి వినతి



చార్మినార్: యాకుత్‌పురా నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు దారుస్సలాంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. నగేష్, రవీందర్, సాయివర్ధన్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్కీమ్‌లో అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది కనీస వేతనానికి నోచుకోకుండా శ్రమ దోపిడీకి గురవుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి విమర్శించారు. కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్ర ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న ఈ స్కీమ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జీతాల చెల్లింపు తదితర అంశాలు రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాల్సి ఉన్నా.. జీతాల పెంపుదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందన్నారు. ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, డీహెచ్ గడల శ్రీనివాసరావులు మాట్లాడారు. శ్రీనివాసరావు హామీతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు యూనియన్ ప్రకటించింది. ఎన్‌హెచ్ఎం నాయకులు పారిజాతం, వేణు, శ్రీనివాస్, బాబు, రాఘవేంద్ర, సామ్.బిన్.అలీ, మధుకర్, బాపు యాదవ్, సాగర్, కమ్రాన్, జన్నుకొర్నాల్, పద్మ, వంగ రాజేష్, శ్రీకాంత్, దిలీప్‌కుమార్, రమాదేవి, వైకుంఠం జ్యోతి, అనూష, సుమ గాదె మోహన్ సుష్మ, సురేష్, నూకల అంజి, శ్రీధర్, కళ్యాణి, రమాదేవి, అభిషేక్, సతీష్ తదితరులున్నారు.

అభినందన.. సత్కారం

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని, తిలక్‌నగర్ మహిళామండలి ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త జయలక్ష్మి అభినందన సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా దూరదర్శన్ పూర్వ సంచాలకులు పాలకుర్తి మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. జయలక్ష్మి సాహితీశ్రీ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ రచయిత్రి కేవీ.కృష్ణకుమారి, యువకళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, జీవీఆర్.కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

వేగంగా ఆలయ పునర్నిర్మాణ పనులు



ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

చార్మినార్: దూద్‌బౌలీలోని సీత్లామాతా దేవాలయ పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.రాజేశ్వర్‌రావు తెలిపారు. పనులు దాదాపు పూర్తైన సందర్భంగా దేవాలయ ప్రధాన ద్వారానికి జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పురాతన దేవాలయంగా ప్రాచుర్యం పొందిన ఈ దేవాలయానికి తాను స్వచ్ఛందంగా ముందుకొచ్చి నిర్మాణ పనులు చేయిస్తున్నానన్నారు. టైల్స్, ఫ్లోరింగ్, ఫాల్ సీలింగ్ ,గ్రానైట్ తదితర పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈనెల 18న నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల పూజలకు దేవాలయం సిద్ధమవుతుందన్నారు. ఎస్.కిషన్‌కుమార్, ఆర్.దీపేష్ తదితరులున్నారు.

ఊట వచన కవిత్వ సంపుటి ఆవిష్కరణ



సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి

నాంపల్లి: ఊట వచన కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ, అంకితోత్సవం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయం గద్వాల్ తెలుగు అధ్యాపకులు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు రచించారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. హెచ్‌సీయూ ఉపకులపతి ఆచార్య బీజేరావు, ఆచార్య హేమవతి దంపతులకు ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు. గంటా మనోహర్ రెడ్డి పుస్తక సమీక్ష చేశారు. బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ అగ్రహారం చందోజీ, తెలుగుభాష చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్, మురారికార్ ప్రశాంత్, సంతోష్, మహేందర్, శివరాం, బాబాజీ, బాలాజీ, మురళీధర్ తదితరులున్నారు.

నాయీబ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు నాయీబ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ సీట్లు కేటాయించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నాయీబ్రాహ్మణులు మారాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యతతోనే నాయిబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రజకుల వృత్తి రజకులే చేసుకులా విధంగా ప్రత్యేకమైన జీఓను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు యానాదయ్య, నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్, కోట్ల రామకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

సంతోష్‌నగర్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపరాదని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహనాయక్ సూచించారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడు మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరు పరచగా.. వారికి జైలు శిక్ష పడిందన్నారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే తన ప్రాణంతో పాటు కుటుంబం కూడా రోడ్డున పడతారన్నారు.

విద్యుత్ కార్మికుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం

అఫ్జల్‌గంజ్: విద్యుత్ కార్మికుల (ఆర్టిజన్) సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని ప్రజా ఏక్తా పార్టీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆరోపించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సంస్థ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ బేగంబజార్ డివిజన్ సిటీ –9 ఆధ్వర్యంలో గోషామహల్‌లోని డీఈ కార్యాలయం వద్ద రిలేనిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన బోనాల శ్రీనివాస్, సీపీఎం గోషామహల్ నేత నాగేశ్వర్‌లు సందర్శించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర విభాగమైన విద్యుత్తుశాఖలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి 3311కేవీ సబ్ స్టేషన్లలో 4వ ఆపరేటర్, వాచ్‌మెన్‌లను నియమించాలన్నారు. కార్మిక సంఘం నేతలు మున్నాలాల్, రాజయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, హరి, మోహన్, కృష్ణరాజు ఉన్నారు.

ఇంటిపై నకిలీ విద్యుత్ వైర్ల నిల్వ.. కేసు నమోదు

అఫ్జల్‌గంజ్: నకిలీ విద్యుత్ వైర్లను నిల్వచేసిన వ్యక్తి ఇంటిపై టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడ మహారాజ్‌గంజ్ మాతా దేవాలయం సమీపంలోని ఓ ఇంట్లో నకిలీ విద్యుత్తు కేబుళ్లు అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 11న రాత్రి పోలీసులు దాడి చేశారు. రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లా బాక్రా గ్రామానికి చెందిన లలిత్‌కుమార్ (27) గత కొంత కాలంగా ట్రూప్‌బజార్‌లోని ఓ ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్నాడు. అక్రమంగా నకిలీ విద్యుత్తు కేబుళ్లను నిల్వ చేస్తుండటంతో అతడితో పాటు విద్యుత్తు కేబుళ్లను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో స్త్రీ సాధికారిత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీలకు మానసిక, శారీరక సమస్యలకు సంబంధించిన అవగాహన కార్యక్రమం బ్రాండ్ టచ్ సంస్థ నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ ప్రతినిధి చట్నాతల్వార్ విద్యార్థినీలు తమ శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థినీలు చదువుల్లో, ఇతర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, దీనికి తగిన శారీరక, మానసిక ధృడత్వం కలిగి ఉండాలన్నారు. అవధానం సుజాత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ సుదక్షణ, డాక్టర్ చిత్తరంజన్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. 160 మంది విద్యార్థినులకు బ్రాండ్ టచ్ సంస్థ ఉచితహెల్త్ కిట్లను అందజేశారు.

అక్రమంగా రేషన్‌ను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

3 క్వింటాళ్ల బియ్యం, 6.5 క్వింటాళ్ల గోధుమలు స్వాధీనం

సంతోష్‌నగర్: అక్రమంగా రేషన్ బియ్యం, గోధుమలను విక్రయిస్తున్న స్థావరంపై సౌత్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పౌర సరఫరాలశాఖ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. మంగళవారం జరిపిన ఈ దాడుల్లో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 6.5 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట్ వహేద్‌కాలనీ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఉమర్ (20) స్థానిక ప్రాంతాలు, ఇళ్లల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం, గోధుమలను రూ.10లకు కేజీ చొప్పున సేకరించి వాటిని అవసరమైన వారికి అధిక డబ్బులకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సర్కిల్–1 పౌర సరఫరాలశాఖ అధికారులతో కలిసి దాడులు చేపట్టి బియ్యం, గోధుమలను స్వాధీనం చేసుకుని, పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.